www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

చాళుక్య ద్వారము
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ADIKAVI NANNAYA UNIVERSITY

తొలి తెలుగు విశ్వవిద్యాలయ వారపత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య బట్టుగంగారావు
కుల సచివులు

సంపాదకులు
డా. తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక : 3 | 19-10-2020 | పుటలు:4




## నన్నయ సెట్ కు పెరుగుతున్న ఆదరణ

### పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన వీసీ జగన్నాథరావు

**మీడియా సెల్, 17.10.20:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అతిపెద్ద విశ్వవిద్యాలయంగా ఉన్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పీజీ ప్రవేశాల కొరకు ఏర్పాటు చేసిన నన్నయ సెట్ 2020 కి ఆధరణ పెరుగుతుందని, కోవిడ్ సమయంలో కూడా ఎక్కువ మంది విద్యార్థులు నన్నయ సెట్ పరీక్షలను వ్రాస్తున్నారని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 16వ తేది నుండి 19వ తేది వరకు నన్నయ సెట్ పరీక్షలను నిర్వహిస్తుంది. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం ఎస్.కె.వి.టి కళాశాలలో జరుగుతున్న నన్నయ సెట్ పరీక్షల నిర్వహణను వీసీ మొక్కా జగన్నాథరావు పరిశీలించారు. పరీక్ష కేంద్రాలలో భౌతిక దూరం పాటించడం, సేనిటేజర్లను ఉపయోగించడం, మాస్కులు ధరించడం వంటి కోవిడ్ నిబంధనలపై వీసీ ఆరా తీసారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నన్నయ సెట్ 2020 పరీక్షలను ఈ నెల 16వ తేది నుండి 19వ తేది వరకు నిర్వహిస్తున్నామని అన్నారు. నన్నయ సెట్ కొరకు 6810 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కోవిడ్ మిగిలినవి.. 2లో..

## డిగ్రీ ఫైనలియర్ ఫలితాల విడుదల

### ఉభయగోదావరి జిల్లాల్లో 77.76 శాతం ఉత్తీర్ణత... వీసీ మొక్కా జగన్నాథరావు



డిగ్రీ పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ జగన్నాథరావు

**మీడియా సెల్, 16.10.20:** ఉభయ గోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ ఫైనల్ ఇయర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసామని 77.76 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైయ్యారని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో శుక్రవారం 2017- 19 విద్యా సంవత్సరానికి చెందిన డిగ్రీ విద్యార్థుల పరీక్ష ఫలితాలను వీసీ విడుదల చేసారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో 22573 మంది విద్యార్థులు డిగ్రీ ఫైనల్ ఇయర్ పరీక్షలు వ్రాసారని వారిలో 17552 మంది ఉత్తీర్ణులయ్యారని ఉత్తీర్ణత శాతం 77.76 గా ఉందని అన్నారు. ఆయా కోర్సుల వారిగా వివరాలను వీసీ వెల్లడించారు. ఆర్ట్స్ లో బిఏ, బిఏ ఒకేషనల్ కోర్సులలో 1752 మంది విద్యార్థులు పరీక్ష వ్రాయగా 1313 మంది ఉత్తీర్ణులయ్యారని ఉత్తీర్ణత శాతం 74.94 గా ఉందన్నారు. కామర్స్ లో బి.కామ్, బి.కామ్ కంప్యూటర్స్ కోర్సులలో 6619 మంది మిగిలినవి.. 2లో..

## మంచి మాట

**అయం నిజః పరోవేతి**
**గణనా లఘు చేతసాం ।**
**ఉదార చరితానాంతు**
**వసుధైవ కుటుంబకమ్ ॥**

ఇతడు మనవాడు, అతడు పరాయివాడు అనే విచక్షణ అల్ప మనస్కులైన వారికే కలుగుతుంది. ఉదారహృదయులకు లోకమంతా కుటుంబమే.

## సమాజ హితమైన పరిశోధనలు అవసరం

### ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి



**మీడియా సెల్, 12.10.20:** నూతన ఆవిష్కరణలతో సమాజానికి ఉపయోగపడే విధంగా పరిశోధనలు ఉండాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రరెడ్డి అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో "రీసెర్చ్ మెథడాలజీ" అనే అంశంపై నిర్వహిస్తున్న వారం రోజుల నేషనల్ వర్క్ షాపు సోమవారం ప్రారంభం అయింది. దీనికి ముఖ్య అతిథిగా యాప్సీ చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రరెడ్డి హాజరై కీలక ఉపన్యాసాన్ని అందించారు. దీనిలో ఆయన మాట్లాడుతూ పరిశోధన పద్ధతులను అనుసరిస్తూ సమాజానికి తెలియని నూతన విషయాలను సమాజ హితమైన అంశాలను పరిశోధనల ద్వారా వెలుగులోనికి తీసుకురావాలని అన్నారు. సంప్రదాయ పరిశోధనలకు భిన్నంగా ఎప్పటికప్పుడు నూతన అంశాలపై ఆవిష్కరించాలని చెప్పారు. ఇక నుండి రాష్ట్ర స్థాయి పరిశోధన సమన్వయ కమిటీ ద్వారా మిగిలినవి.. 2లో..

## సంపాదకీయం

# విజయదశమి



చిత్రం:శివకుమారి

ప్రతి మనిషికి ఆత్మస్థైర్యాన్ని కలిగించేలా ఉంటుంది ' విజయదశమి ' అనే మాట. నవరాత్రులు, దసరా అనేసరికి దుర్గాదేవి మహిషాసురుడ్ని మర్దించడం మూలమని తెలుస్తుంది. దుష్టశిక్షణకి ప్రతీక ఈ పండుగ. అమ్మవారి ఆలయాలన్నీ సందడిగా ఉంటాయి. పూజలు, నైవేద్యాలు, పండివంటలు, బొమ్మలకొలువులు , కొత్తబట్టలు, నగలు, చుట్టాలు సందడి, ప్రభలు, ఊరేగింపులు . . . అందునా విద్యార్థులకు దసరా సెలవులు . . ఇదీ దినచర్య !

కరోనా రక్కసి కోరల్లో ఈ ఏడాది ఉత్సవాలు, పండుగలు, పెళ్ళిళ్ళు, ఊరేగింపులు, జనసందోహాలు, కేరింతలు మాయమై ఒక స్తబ్దత అలుముకొంది. ఎవరి ప్రాణాల్ని వాళ్ళు రక్షించుకునే కాలంనడుస్తోంది. భయం, ఆందోళన రాజ్యమేలుతోంది. ప్రపంచమంతా త్వరలోనే దీనినుండి విముక్తిని కోరుతోంది. ఆనందంగా, హాయిగా మన ముఖంలోని హావభావాల్ని ఎదుటివారికి వ్యక్తం చేసే రోజుకోసం ఎదురు చూస్తోంది. మాస్క్ నుంచి విముక్తిని కోరుతోంది. తరగని గదుల్లో, వరండాల్లో కలసి సరదాగా తిరిగే వాతావరణం కోసం విద్యార్థిలోకం తహతహలాడుతోంది.

నాడు మహిషాసురుడు ఒక్కడేనేమో ! సంహరించడం సులభమైంది. తెల్లవారితే పత్రికల్లో, టీవీల్లో ఎంతమంది మహిషాసురులో - ఎన్ని అకృత్యాలో. ' గజానికొక గాంధారీ కొడుకు - గాంధీ గారి దేశంలో ' అన్నారు తిలక్ అనే తెలుగు కవి. చాలామంది దుష్టులను శిక్షించాల్సిన బాధ్యత అమ్మవారి మీద పడింది. వాక్సిన్ వస్తే కరోనా పోతుంది. ఈ సమాజంలో మంచివాళ్ళుగా నటిస్తూ వంచన చేస్తున్న దుర్మార్గుల్ని నిర్మూలించే వాక్సిన్ వస్తుందా ? ఇది చాలా పెద్ద ప్రశ్న. మనిషి ఆశావహుడు కాబట్టి మెరుగైన సమాజం కోసం విలువలు బ్రతికుండాలని ఎదురు చూస్తాడు.

*కరోనా మహమ్మారితో పాటు, సామాజిక రుగ్మతలూ నశించాలని ఈ విజయదశమికి కోరుకుందాం !!*

## నన్నయ సెట్ కు ఆదరణ

**(మొదటి పేజీ తరువాయి)**

నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తూ పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. పరీక్ష కేంద్రాలను పెంచామని ఉభయ గోదావరి జిల్లాలతో పాటు విజయవాడ, విశాఖపట్నంతో కలిపి 10 నన్నయ సెట్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ కాకినాడ, ఎస్.కె.వి.టి కాలేజ్ రాజమహేంద్రవరం, ఎస్.కె.బి.ఆర్ కాలేజ్ అమలాపురం, ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ రంపచోడవరం, పశ్చిమగోదావరి జిల్లాలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ క్యాంపస్ తాడేపల్లిగూడెం, శ్రీ సి.ఆర్.రెడ్డి పీజీ కాలేజ్ ఏలూరు, కె.జీ.ఆర్.ఎల్ పీజీ కాలేజ్ భీమవరం, శ్రీరామచంద్రా డిగ్రీ కాలేజ్ జంగారెడ్డిగూడెం, విశాఖపట్నంలోని గాయత్రి విద్యాపరిషత్ కాలేజ్, విజయవాడలోని ఎస్.ఆర్.ఆర్ అండ్ సి.వి.ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ లలో పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. 16వ తేదీన ఉదయం లైఫ్ సైన్సెస్(101), మధ్యాహ్నం మేథమెటిక్స్(103), జియాలజీ(105) పరీక్షలు జరిగాయని తెలిపారు. 17వ తేదిన ఉదయం ఫిజికల్ సైన్సెస్(102), మధ్యాహ్నం కంప్యూటర్ సైన్సెస్(106) పరీక్షలు



జరుగుతున్నాయని అన్నారు. అలాగే 18వ తేదిన ఉదయం కెమికల్ సైన్సెస్(104), మధ్యాహ్నం హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్(201), 19వ తేదిన ఉదయం ఇంగ్లీషు(202), ఎం.పి.ఈడీ(205), మధ్యాహ్నం హిందీ(204), తెలుగు(203) పరీక్షలు జరుగుతాయన్నారు. కోవిడ్ నిబంధనలు తప్పని సరిగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే విద్యార్థులు కూడా వ్యక్తిగత జాగ్రత్తలు పాటిస్తూ పరీక్షలకు హాజరు కావాలని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో కోవిడ్ నిబంధనలను పాటిస్తూ ఎక్కువ మంది విద్యార్థులకు నన్నయ సెట్ పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డా.డి.జ్యోతిర్మయి, అసోసియేట్ డైరెక్టర్స్ డా.కె.వి.స్వామి, డా.కె.దీప్తి, కళాశాల యాజమన్యం పాల్గొన్నారు.

## సమాజ హితమైన పరిశోధనలు అవసరం

**(మొదటి పేజీ తరువాయి)**

పరిశోధనలలో నాణ్యత పెరుగుతుందని ఆశిస్తున్నామన్నారు. పేటెంట్ టెక్నాలజీ వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఎంతో ఉందని చెప్పారు. పరిశోధన సంఖ్యకు తగినన్ని పేటెంట్స్ లేవని కాబట్టి పేటెంట్ రైట్స్ ను సంపాదించుకోవాలని తెలిపారు. పరిశోధన పద్దతులను అనుసరించి ఉత్తమ పరిశోధనలను సమాజానికి అందించే విధంగా భావి పరిశోధకులు ప్రయత్నించాలని సూచించారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ పరిశోధనలు శాస్త్రీయ బద్దంగా ఉండాలని అన్నారు. అన్ని దేశాల కంటే భారతదేశంలోనే పరిశోధనలు ఎక్కువగా జరుగుతున్నాయని కానీ వాటికి సంబంధించిన హక్కులను సాధించడంలో వెనుకబడుతున్నామని తెలిపారు. పరిశోధనలలో నిబద్దత, నాణ్యత, విలువలు తప్పని సరిగా ఉండాలని చెప్పారు. పరిశోధన అంశంలోను, పరిశోధన పద్దతులలోను, పరిశోధన క్రమంలోను కొత్తదనం ఉండాలని అప్పుడే ఆ పరిశోధనకు విలువ ఉంటుందని తెలిపారు. పరిశోధన పద్దతులపై వారు రోజుల పాటు నేషనల్ వర్క్ షాప్ ను నిర్వహిస్తున్న నిర్వహకులను వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ వర్క్ షాపు కన్వీనర్ స్కిల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్, ఈసీ మెంబర్ డా.బి.జగన్మోహనరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు, ఈసీ మెంబర్ ఆచార్య కొట్టి శ్రీరమేష్, ప్రిన్సిపాల్స్, ఆయా విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, అధికారులు, ఆచార్యులు పాల్గొన్నారు.

## డిగ్రీ పరీక్ష ఫలితాలు

**(మొదటి పేజీ తరువాయి)**

విద్యార్థులు పరీక్షలు వ్రాయగా 5427 మంది ఉత్తీర్ణులైయ్యారని ఉత్తీర్ణత శాతం 81.99 గా ఉందని అన్నారు. సైన్స్ లో బిఎస్సీ, బిఎస్సీ ఫుడ్ టెక్నాలజీ, బిఎస్సీ యానిమేషన్, బిఎస్సీ ఫోరెన్సిక్ సైన్స్ కోర్సులలో 13223 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా 9915 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఉత్తీర్ణత శాతం 74.98 గా ఉందన్నారు. ప్రొఫిషనల్ కోర్సులలో బిబిఎ, బిసిఎ లో 979 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా 897 మంది ఉత్తీర్ణులైయ్యారని ఉత్తీర్ణత శాతం 91.62గా ఉందని చెప్పారు. సమర్థవంతంగా పరీక్షలు నిర్వహించి సకాలంలో పరీక్ష ఫలితాలను అందించిన విశ్వవిద్యాలయ పరీక్ష విభాగానికి వీసీ అభినందనలు తెలియజేసారు. రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు డీన్ ఎగ్జామినేషన్ డా.ఎ.మట్టారెడ్డి, అసిస్టెంట్ డీన్ డా.డి.కళ్యాణి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్నేషన్ ఎస్.లింగారెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.విజయకుమారి, సిస్టమ్ మేనేజర్ వి.ఎ.ఎం.జ్యోతి, యూనివర్సిటీ లీగల్ ఆఫీసర్ నందెపు నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన వీసీ


**మీడియా సెల్, 15.10.20:** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో పరీక్షా కేంద్రాన్ని ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు గురువారం పరిశీలించారు. వివిధ కళాశాలల్లో ఎంఈడీ, ఎల్.ఎల్.ఎమ్ చదివే విద్యార్థులు విశ్వవిద్యాలయంలో విద్యా కళాశాల కేంద్రంగా పరీక్షలు రాస్తున్నారు. ఈ కేంద్రాన్ని సందర్శించిన వీసీ కొవిడ్ పరంగా తీసుకున్న జాగ్రత్తలను పరిశీలించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎల్.ఎల్.ఎమ్ 122 మంది విద్యార్థులు, ఎంఈడీ



32 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారని అన్నారు. పరీక్ష ప్రశాంతంగా జరుగుతున్నాయని శుక్రవారంతో ఈ పరీక్షలు ముగుస్తాయని చెప్పారు. దీనిలో నన్నయ విద్యా కళాశాల ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎస్.లింగారెడ్డి మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.




## శీలావీర్రాజుకు శిఖామణి సాహితీ పురస్కారం




సాహిత్యం లో జీవన సాఫల్య కృషికి గాను ప్రతీ యేటా ఇచ్చే 'శిఖామణి సాహితీ పురస్కారం' 2020కి ప్రముఖ కవి, రచయిత,చిత్రకారులు శీలావీర్రాజు ఎంపిక అయ్యారు.అవార్డు కింద పది వేల రూపాయలనగదు, జ్ఞాపిక, దుశ్శాలువా తో సత్కారం ఉంటుంది.గతం లో ఈ పురస్కారం కె.శివారెడ్డి, గోరటి వెంకన్న,ఇంద్రగంటి శ్రీ కాంత శర్మ, ఓల్గా అందుకున్నారు.ప్రధాన పురస్కారం తో పాటు కవి సంధ్య ప్రతిభా పురస్కారాలకోసంఎస్వీ రాఘవేంద్ర రావు, జ్యోతి చంద్ర మౌళి, దిలావర్,పెనుగొండ లక్ష్మీ నారాయణ, సంగెవేని రవీంద్ర,మేడి శెట్టి తిరుమల కుమార్, విజయ చంద్ర, చల్లపల్లి స్వరూపరాణి ఎంపిక అయ్యారు.అవార్డు కమిటీ సభ్యులుగా శివారెడ్డి,ఓల్గా,దేవదానం రాజు వ్యవహరించారు.అవార్డు ప్రదాన సభ అక్టోబరు 30 సా.5గంటలకు జూమ్ వేదిక పై జరుగుతుందని కవిసంధ్య సంస్థ నుండి యానాం అవార్డు కమిటీ అధ్యక్షులు దాట్ల దేవదానంరాజు తెలిపారు.
శీలా వీర్రాజు సతీమణి శీలా సుభద్రాదేవి విశేషమైన రచనలు, కథాసంకలనాలు వెలువరించారు. ఈ దంపతులిరువురు తమ సమగ్ర సాహిత్యాన్ని, పెయింటింగ్ నమూనాల గ్రంథాలను నన్నయ విశ్వవిద్యాలయ తెలుగుశాఖకు బహూకరించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు శీలా వీర్రాజు, సుభద్రాదేవి దంపతులకు అభినందనలు, కతజ్ఞత తెలియజేశారు.

## నన్నయ సూక్తి నిధి

**వార్తయందు జగము వర్ధిల్లుచున్నది**
**యదియు లేని నాడ యఖిల జనులు**
**అంధకారమగ్నులగుదురు కావున**
**వార్త నిర్వహింప వలయు పతికి**

**(మహాభారతం 2-1-15)**

ప్రపంచమంతా వార్తమీదే నడుస్తుంది. అది లేకపోతే ప్రజలంతా చీకట్లో మునిగినట్లే. అందువలన ప్రభువు వార్తను బాగా నడపాలని అర్థం. (ప్రభుత్వాలకు, వ్యవస్థలకు సమాచార నిర్వహణ అవసరమని తాత్పర్యం)

# కష్టే ఫలి

## స్ఫూర్తి



'అనుభవం నుండి నేర్చుకున్నది అనుభవం జ్ఞానం ' అని అబ్దుల్ కలాం గారు చెప్పినట్లుగా జీవితం అనేది ఎవరికీ పూలపాన్పు కాదు. ఒక మంచి జీవితాన్ని మనం అందుకోవాలి అంటే అది మనచేతుల్లోనే ఉంటుంది. కష్టాలు, కన్నీళ్ళు మనకు రోజూ ఉండవు కాబట్టి , చిన్న చిన్న సమస్యలకు బాధపడి జీవితం అంతా అయిపోయింది అని కూర్చుంటే మనం మన జీవితాన్ని మార్చుకోలేం. ఎవరైనా మనకు కొంత వయసు వచ్చినంత వరకే తోడుగా ఉంటారు. ఆ తరువాత మన జీవితాన్ని మనకు నచ్చిన విధంగా , అభివృద్ధి దిశగా తీర్చిదిద్దుకోవాలి.

నేను ఒకవైపు చదువుకుంటూ, మరోవైపు హోటల్‌లో పార్టుటైం జాబ్ చేసుకుంటూ చదువును పూర్తి చేసాను. నేను కనుక ఆరోజు కష్టపడడానికి సిగ్గుపడి ఉంటే, ఈరోజు నాజీవితం ఎలా ఉండేదో ? మనం చేసే పనిలోనే ఆనందాన్ని వెదుక్కోవడం అలవరచుకోవాలి. ఈరోజు నేను నాకిష్టమైన వృత్తిలో ఉన్నానంటే దానికి కారణం మా ఆచార్యులు. మనకు అమూల్యమైన జ్ఞానాన్ని అందించిన గురువుల మాటలు వింటూ , వాటిని మన జీవితానికి అన్వయించుకుంటూ పోతే విజయం మనల్ని వెతుక్కుంటూ దానంతటదే వస్తుంది. ఎవరో వస్తారు, ఏదో చేస్తారు అని ఎదురు చూడకూడదు. మారుతున్న కాలంతో పాటు మనం కూడా మారాలి. కాలంతో పోటీ పడాలి. భయపడే మనస్తత్వం ఉన్నవారికి ఎప్పుడూ ప్రమాదం పొంచి ఉంటుంది. కాబట్టి ఇతరుల విమర్శలకు కృంగిపోకూడదు. ఎవరు ఏమనుకుంటారో అని ఆలోచించకుండా, నీకు నీవే అవకాశాలను సృష్టించుకుంటూ ముందుకు సాగితే విజయం నిన్ను వెతుక్కుంటూ వస్తుంది.

మనకు జన్మనిచ్చిన మన తల్లిదండ్రుల దీవెనలు ఉంటేనే జీవితంలో మంచిగా స్థిరపడతాం.తల్లిదండ్రులిచ్చిన జన్మను సార్థకం చేస్తూ మనకు స్థిరమైన జ్ఞానాన్ని అందించే గురువులు మనకు ప్రత్యక్ష దైవాలు. మిత్రులారా ఈ వాస్తవాన్ని మాత్రం ఎన్నడూ మరువరాదు.

'కష్టపడి పనిచెయ్యండి, ఫలితాన్ని ఆశించండి '

**పూర్వవిద్యార్థి వి.అర్జున్ రావు**
**రీజనల్ మేనేజర్**
**జెంటిల్స్ ఆర్గానిక్స్ (ప్రై) లిమిటెడ్**

## మిథ్య...

జగం
మిథ్య... జనం మిథ్య....
ధనం మిథ్య..... దాహం
మిథ్య...
అహం మిథ్య... ఆశ మిథ్య...
ప్రేమ మిథ్య... పాపం మిథ్య...
మతం మిథ్య... గతం మిథ్యా....
ముక్తి మిథ్య... దైవం మిథ్య....

స్వార్థ మొక్కటే సర్వాంతర్యామి...
సష్టిని నడిపించే పెను సునామి ...
మంచి అన్నది మనలో లేదోయ్.
స్వార్థమొక్కటే సత్యమోయ్....
మనిషి మనసులు నిండిపోయెను
ఈర్ష్య ద్వేషపు ఇంకు రక్తము ...
పక్కవాడిని క్రింద త్రోసి ..
పగలబడి మరి నవ్వే లోకము ..
తనకు మాత్రమే సొంతమంటూ
భ్రమలో బ్రతికే వెర్రి లోకం
మనుషులంతా ఒక్కటేనోయ్ ..
స్వార్థం? శిఖామణులేనోయ్

**ఎస్.కె.బాబు, ఎంబిఏ**
**ద్వితీయ సంవత్సరం**
**నన్నయ క్యాంపస్**

## వలస

**రొక్కం లక్ష్మీబాయి**
**జూనియర్ అసిస్టెంట్**
**ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం**

జీవన రణస్థలిలో అనాదిగా మొదలైంది వలస
సొంతగడ్డపై పూట గడిచే దిక్కులేక, ఆకలికి తాళలేక
పట్టణాల దిశగా కార్మికుడు మార్చాడు తన బస
హమ్మయ్య ! అంటూ సేద తీరే సమయంలో
'కరోనా కాలనాగు ' విషపు కోరలు చాస్తూ కొట్టింది బుస
తినేతిండి, తాగేనీరు, పీల్చేగాలి సర్వం విషమయం
జీవన వాంఛతో ఆశలను ప్రోది చేసుకున్న కార్మికుడయ్యాడు నిరాధారం
జేబు నింపే కర్మాగారాలు ముఖం చాటేసాయి
అమ్మలా ఆకలి తీర్చే హోటళ్ళు బోర్డు తిప్పేసాయి
దాతలు దయ తలిస్తేనే పూట గడిచేది
విశాలమైన విశ్వంలో కార్మికుడయ్యాడు ఒంటరి పక్షి
ఊరు గాని ఊరిలో సహాయ కేంద్రాల అవగాహన లేదాయె
ప్రభుత్వ పథకాలకు ఆధారే ఆధారం,
ఆధార్ తెలియని కూలోడి గతి నిరాధారం.
ప్రాణాల మీద తీపితో సొంత గూటికి మొదలైంది నడక ...
భుజాల మీద మూటలతో, చంకన బిడ్డలతో ...
నడక ... నడక ... నడక ... వేల మైళ్ళ కొద్దీ నడక...
బొబ్బలెక్కి పోతున్న కాళ్ళు, ఎండిపోతున్న డొక్కలు
అలసిన శరీరాలకు ఫుట్‌పాత్‌లే పట్టుపరుపులు
ఆర్తిగా అక్కున చేర్చుకోడానికి సొంతూరు రమ్మన్నా,
లాక్‌డౌన్ రూల్స్, పోలీసు లాఠీలు ప్రతాపిస్తూ ' క్వారంటైన్ ' కి పొమ్మంటున్నాయి.
మహమ్మారి ఏమూలనుండి విజృంభిస్తుందో తెలీదు
రోడ్డు పాలైన ఒక్కోడు ఒణికి పోతున్నాడు ప్రాణభయంతో..
మతి గతి తప్పి ఉసురు తీసుకుంటున్న వాళ్ళెందరో
కరోనా రక్కసి కోరల్లోంచి తప్పుకోవాలన్న కార్మికుని ఆశే భవిష్యత్ పునాది.




# ప్రధానాంశాలపై కార్యాచరణ సిద్ధం

జాతీయ విద్యావిధానంపై గవర్నర్ వీడియో కన్ఫరెన్స్



**మీడియా సెల్, 16.10.20:** జాతీయ విద్యావిధానం-2020 ప్రణాళికలు మరియు అమలు పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలతో శుక్రవారం గవర్నర్ బిశ్వభూషణ్ హరిచంద్రన్ వీడియో కన్ఫరెన్స్ ను నిర్వహించారు. దీనిలో విశ్వవిద్యాలయాల ఛాన్సలర్, గనర్నర్ బిశ్వభూషణ్ హరిచంద్రన్ తో పాటు విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఉన్నత విద్యాశాఖ అధికారులు మరియు విశ్వవిద్యాలయ వీసీ లు, రిజిస్ట్రార్ లు హాజరయ్యారు. వీడియో సమావేశం అనంతరం దీనికి సంబంధించిన వివరాలను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలియజేసారు. దీనిలో వీసీ మాట్లాడుతూ నూతన విద్యావిధానంపై ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ప్రణాళికను తెలియజేసామని చెప్పారు. ఇప్పటికే విశ్వవిద్యాలయంలో స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. విశ్వవిద్యాలయంతో పాటు అనుబంధ కళాశాలలో స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్ మల్టీ డిసెప్లెనరీ ప్రోజెక్టులను, అర్హత ఉన్న అనుబంధ కళాశాలలకు అటానమస్ గుర్తింపును ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఉన్నత విద్యా ప్రమాణాలను 36 నుండి 50 శాతానికి పెంచేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఓపెన్ లెర్నింగ్ సిస్టమ్, నేషనల్ రిసర్చ్ ఫౌండేషన్, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సి వంటి వాటిని ఉపయోగించుకుంటామని చెప్పారు. పరిశ్రామిక శిక్షణ సంస్థలకు సంబంధించిన తరగతులను ప్రారంభిస్తామన్నారు. జాయింట్ రిసెర్చ్ ప్రోగ్రామ్ లు, జాయింట్ డిగ్రీ ప్రోగ్రామ్ లను అందుబాటులోనికి వస్తాయని చెప్పారు. నూతన విద్యా విధానంలోని కొన్ని ప్రధాన అంశాలపై యాక్షన్ ప్లాన్ ను సిద్ధం చేసామని దానిని కార్యరూపంలోనికి తీసుకువచ్చి విజయవంతం చేస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వీసీ తో పాటు రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు పాల్గొన్నారు.


బ్రోచర్ ను ఆవిష్కరిస్తున్న వీసీ

# తిలక్ సాహిత్యంపై అంతర్జాతీయ సదస్సు

**మీడియా సెల్, 12.10.20:** ఆధునిక తెలుగు సాహిత్యం - తిలక్ వైశిష్ట్యం" అనే అంశంపై అంతర్జాతీయ అంతర్జాల సదస్సును ఈ నెల 23, 24 తేదీలలో నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. దీనికి సంబంధించిన బ్రోచర్ ను సోమవారం వీసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ మరియు మహర్షి సాత్యవతేయ విజ్ఞాన పరిషత్తు అయితంపూడి సంయుక్త ఆధ్వర్యంలో 23,24 తేదీలలో అంతర్జాతీయ వెబినార్ ను నిర్వహిస్తున్నామని అన్నారు. దీనికి కన్వీనర్లుగా ఆచార్య రంకిరెడ్డి రామమోహనరావు, డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్ లు వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో దేవరకొండ బాలగంగాధరతిలక్ తనదైన ముద్రను వేసుకున్నారని తెలిపారు. తిలక్ కవిత్వం, కథలు, పద్యం, పత్రికలు, వర్ణనలు మరియు ఆధునిక కవుల ప్రభావం వంటి అనేక సాహిత్య అంశాలపై పరిశోధన పత్రాలను ఆహ్వానిస్తున్నారని అన్నారు. అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, తెలుగు సాహిత్య అభిమానులు ఈ వెబినార్ ను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేసారు. రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు నిర్వాహకులను అభినందించి అంతర్జాతీయ సదస్సు విజయవంతం కావాలని శుభాకాంక్షలను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఆఫీసర్ నందెపు నాగేంద్రరావు, కన్వీనర్లు ఆచార్య రంకిరెడ్డి రామమోహనరావు, డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్, తెలుగు శాఖ విభాగాధ్యాపకులు డా.తలారివాసు, డా.టి.సత్యనారాయణ, డా.లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వీసీని కలిసిన ఎన్.ఐ.ఆర్.ఎం చీఫ్ సైంటిస్ట్


నన్నయ వీసీని కలిసిన సైంటిస్ట్ డా.డి.వి.సుబ్రహ్మణ్యం

**మీడియా సెల్, 17.10.20:** నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్, బెంగుళూరు డివిజన్ హెడ్ అండ్ ఛీఫ్ సైంటిస్ట్ డా.డి.వి.సుబ్రహ్మణ్యం వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావును మర్యాదపూర్వకంగా కలిసారు. విశ్వవిద్యాలయంలో శనివారం వీసీ మొక్కా జన్నాథరావును కలిసి విద్యాపరమైన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా డా.డి.వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గోదావరి జిల్లాలకు విద్యా కేంద్రంగా ఉన్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా తమ గురువు ఆచార్య మొక్కా జగన్నాథరావు ఉండడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. జగన్నాథరావు మార్గదర్శకంలో అనేక మంది విద్యార్థులు ప్రపంచ దేశాలలో ఉన్నత స్థానాలలో స్థిరపడ్డారని తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ముఖ్యంగా జియాలజీ విభాగానికి నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ నుండి అన్ని విధాల సహకారాన్ని అందిస్తామని చెప్పారు. దీనిపై వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ భారత ప్రభుత్వ గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ పని చేస్తుందని దానిలో ఛీఫ్ సైంటిస్ట్ గా మరియు డివిజన్ హెడ్ గా తన విద్యార్థి డా.డి.వి.సుబ్రహ్మణ్యం ఉండడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. భవిష్యత్ లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మరియు నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్, బెంగుళూరు మధ్య అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంటామని అన్నారు. దీని ద్వారా రాక్ మెకానిక్స్ వంటి కోర్సుల ఏర్పాటు, కొత్త ప్రోజెక్టులు, పరిశోధన అవకాశాలు, విద్యార్థులకు శిక్షణ మరియు ఉద్యోగావకాశాలు వంటి ఉపయోగాలు ఎన్నో ఉంటాయని తెలిపారు. త్వరలో ఎన్.ఐ.ఆర్.ఎం మరియు విశ్వవిద్యాలయం మధ్య ఎంఓయు జరుగుతుందని తెలియజేసారు.

# కలామ్ జీవితం స్ఫూర్తిదాయకం - వీసీ మొక్కా జగన్నాథరావు



**మీడియా సెల్, 15.10.20:** సామాన్యుడి నుంచి రాష్ట్రపతిగా ఎదిగిన డాక్టర్ అబ్దుల్ కలామ్ జీవితం దేశానికే ఆదర్శనీయమని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. కలమ్ జయంతి సందర్భంగా గురువారం యూనివర్సిటీలో చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అబ్దుల్ కలామ్ చిన్నతనం నుండి చాలా కష్టపడి విద్యపట్ల ఆశక్తితో గొప్ప శాస్త్రవేత్తగా ఎదిగి అంతరిక్ష పరిశోధనలో అనేక అద్భుతాలను సష్టించారని అన్నారు. విద్య సామాన్యుడిని సైతం విజ్ఞానవంతులుగా మార్చి ఉన్నత శిఖరాలపై నిలుతుంది అనడానికి అబ్దుల్ కలామ్ జీవితం చక్కటి ఉదాహరణ అని తెలిపారు. భారతదేశానికే గర్వకారణంగా నిలిచిన అబ్దుల్ కలామ్ ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా యువత కలామ్ మార్గదర్శకంలో నడిచి దేశాభివద్ధికి పాటుపడాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఈసీ మెంబర్ ఆచార్య కొట్టి శ్రీరమేష్, రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు, ప్రిన్సిపాల్స్ డా.కె.రమణేశ్వరి, డా.కె.సుబ్బారావు, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డా.డి.జ్యోతిర్మయి, ఆచార్య పి.సురేష్ వర్మ, డా.ఎం.గోపాలకష్ణ తదితరులు పాల్గొన్నారు.